స్వార్థపరుడు

శారద

వకీలు విజయరాఘవరావుగారి ఇంట్లోకి మధ్యాహ్నం పది పదకొండు గంటల ప్రాంతంలో ఆ కుర్రాడు ప్రవేశించాడు. అతనికి దాదాపు పదిహేడేళ్ళుంటాయి. ఎర్రగా ముచ్చటగా వున్నా అతని చినిగిన చొక్కా లాగూ, వైఖరీ, మొహంలో దైన్యమూ అతని లేనితనాన్ని నిరూపిస్తున్నాయి. బెరుకు బెరుకుగా ఆ కుర్రాడు, విజయరాఘవరావుగారి ఆఫీసు రూంలోకి వెళ్ళి గడప దగ్గరగా నిలబడ్డాడు. ఆవేళ ఆదివారం. ప్లీడరుగారు ఆఫీసు గదిలో భోంచేసి తాంబూలం నములుతూ కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. కాళ్ళ చప్పుడుకు తలెత్తి చూశారు ఆయన. కుర్రాడు బహునమ్రతగా చేతులు నలుపుతూ నిలబడ్డాడు. ఏమడగాలని అనుకున్నాడో గాని మాట తెమలక తాత్సారం చేస్తున్నాడు. ప్లీడరుగారు పేపరు ఈజీచైర్ అవతలగా పడేసి సరిగ్గా కూర్చొని, "ఏం పని నాయనా." అని చాలా నెమ్మదిగా కనుక్కున్నారు. కుర్రాడికి ఇంకా మాట తెమల్లేదు. కాని ఒక అడుగు ముందుకేసి, కాస్తంత ధైర్యం కూడగట్టుకుని, లాపుస్తకాల వేపు చూస్తూ 'మరండే, నేను ఇక్కడ చదువుకుంటున్నానండి...' అనినీళ్ళు నమిలాడు. ప్లీడరుగారి వైఖరిలో ఏదోరకమైన ఇంట్రెస్టువొచ్చింది. "చెప్పు ఫరవాలేదు" అన్నారు. కూర్చో అందామనుకుంటూనే ఎంచేతో అనలేదు. కుర్రాడికి ఇప్పటికీ ప్లీడరుగారి మొహంలోకి చూసే ధైర్యం రాలేదు. మెల్లిగా మాట తెముల్చుకుని "అన్ని వారాలూ కుదిరినాయండి ఆదివారం కుదరలేదు" అనగలిగాడు. ఆపై మాట దేనికి అనటం? ప్లీడరు గారు కుర్రాణ్ణి పైనించి కిందిదాకా బాగా పరకాయించి చూశారు. అతని అవస్థ గ్రహించుకుని "భయపడకోయ్. ఏం చదువుతున్నావేమిటి?' అని దయగా అడిగారు. కుర్రాడి వైఖరిలో కూడా కొంచెం మార్పు స్ఫురించింది. ఎండలో వచ్చిన అలసటా, మరో వంక ఆకలీ అతనిలో నీరసాన్ని కల్పించినై కాబోలు. నుంచున్న వాడల్లా నేల మీద చతికిలబడి కూర్చుని "మరేనండి, ఫిఫ్తుఫారం చదువుతున్నాను" అన్నాడు. విజయ రాఘవరావుగారు "ఆదివారం భోజనం కావాలంటున్నావా? దానికేం, అట్లాగే కాని నీ పేరేమిటి నాయనా?" అని ఇంకా దయగా ప్రశ్నించారు.

కుర్రాడు నమ్రత ఉట్టిపడుతున్నట్లు "ప్రకాశరావు అంటారండి" అన్నాడు.

ప్లీడరుగారు ఏదో జ్ఞాపకం తెచ్చుకునే ప్రయత్నంలో రెండు నిమిషాలు పరాకుగా దిక్కులు చూసి "ఇంతకీ ఈ పూట భోంచేశావా? లేకపోతే పద, స్నానం చేసి భోంచేద్దువుగాని" అన్నారు. ఈ మాట అనేసి "సుబ్రహ్మణ్యం" అని కేకేశారు. అవతల గదిలో కేసు కట్టలు చూస్తున్న గుమాస్తా సుబ్రహ్మణ్యం గబగబ లేచి వచ్చి "పిల్చారాండీ?" అని అడిగాడు. అవునన్నట్లు తలూపి ప్లీడరుగారు

కుర్రాణ్ణి గుమాస్తాకి చూపి "ఈ అబ్బాయికి అన్నం పెట్టమను" అన్నారు. తన పదిహేనేళ్ల సర్వీసులో ప్లీడరుగారి వద్ద ఇట్టి ఔదార్యాన్ని ఎన్నడూ ఎరగని గుమాస్తా లోలోపల ఆశ్చర్యపడుతూ "రా రా అబ్బాయి" అని కుర్రాణ్ణి తన వెంట తీసువెళ్ళాడు.

2

విజయరాఘవరావు గారికి నెలకి ఐదారు వందల రూపాయల ప్రాక్టీసున్నది. పిత్రార్జితం ఇరవై ఎకరాల పొలం, రెండిళ్ళూ వున్నాయి. కొడుకు మద్రాసులో 'లా' చదువుతున్నాడు. ఆయనకి ఇహలోకంలో సమస్యలంటూ లేవనే భావించవచ్చు. కాని కూతురు పద్మావతి ఆయనకి పెద్ద సమస్య అయింది. న్యాయానికి ఆడపిల్లే హిందూ సంఘానికి ఒక సమస్య. అందులోనూ, రెండు కాళ్ళూ పుటక నుంచి చచ్చుపడి సన్నగా నడవలేక దేకుతూన్న కూతురు విజయరాఘవరావుగారికి మానసికంగా ఆవేదననీ తీరని సమస్యల్నీ రేపటంలో ఆశ్చర్యంలేదు. ఆ అమ్మాయికి ఇంతకన్నా వేరే ఏ లోపమూ లేదు. తండ్రి ఆమెకు చదువు ఇంటి దగ్గిరనే చెప్పిస్తున్నాడు. హార్మనీ మీద సంగీతం కూడా చెప్పిస్తున్నాడు. గొంతు రమ్యంగా ఉంటుంది. ఆ కాళ్ళు తప్ప ఆమె సౌందర్యవతేనని చెప్పుకోవాలి. కాని, విజయరాఘవరావు గారి మనసు ఎక్కడ బాధపడ్డదీ అంటే ఆమె భవిష్యత్తు ఏమిటా అని. ఈ సమస్య తండ్రి కన్న తల్లికి ఎక్కువగా ఉండటం సహజం కదా! ఆమె అనేక సందర్భాల్లో భర్తతో కూతురు విషయం చర్చిస్తూ వుండేది. వారాల అబ్బాయి వొచ్చిన రాత్రి కూడా ఇదే చర్చ సాగింది. వంటింట్లో ప్లీడరుగారు భోంచేస్తున్న కూతురు వైపు చూసి నిట్టూర్చి "ఎంత డబ్బుంటే ఏం, లాభం ఏమిటి?" అనుకుంటూ అన్నం తినసాగారు. తల్లి వడ్డన ఆపి భర్త మొహం లోకి చూస్తూ "ఏమండీ! నేను పోరటమేనా, మీరేమన్నా ఆలోచిస్తున్నారా?" అన్నది.

"నేనేనా అంత ఖాళీగా కూర్చున్నది? ఆ దిగులు నీకేనన్నట్లు మాట్లాడుతావేమే!" అన్నారు ప్లీడరుగారు.

భార్య కూతురికి మజ్జిగ వడ్డిస్తూ "నా తల్లిని దేవుడు దయతలచలేదు గాని..." అన్నది గద్గదంగా.

కూతురు - తల్లిని, తండ్రిని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఇది వరదాకా మౌనంగా వూరుకున్నదల్లా కాస్త ధైర్యం చేసి "ఏమిటి నాన్నా?" అన్నది ఇంకేదో అనబోయి అనలేక. తండ్రి కూతురు వీపు ప్రేమతో సవరించి, "ఏముందమ్మా! నీకెందుకు ఆ గొడవ? అన్నం తిని పడుకో పో" అన్నారు. తల్లి కూడా ఆ మాటే అన్నది. కాని పద్మకి కాస్తో కూస్తో జ్ఞానం వుండటం వల్ల అమ్మా నాన్నా పడే ఆవేదన అర్థం చేసుకుని వాళ్ళకాబాధ ఎందుకా అని ప్రశ్నించుకున్నట్టున్నది. ఆమె తండ్రి వైపు జిజ్ఞాసా పూర్వకంగా దృష్టి సారించి "నాన్నా! నా పెళ్ళి సంగతేనా నువ్వు మాట్లాడు తున్నది?" అని అడిగింది, కొంచెం సిగ్గుపడ్డప్పటికీ ధైర్యం చేసి. విజయరాఘవరావు "అవును తల్లీ!" అన్నారు. పదిహేనేళ్ళ ప్రాయంలో ఉండి చదువుకుంటూ కాస్త ప్రపంచ జ్ఞానం సంపాయించిన కూతురుకి ఇంకా ఈ విషయం చెప్పకపోవడం సమంజసం కాదని ఆయన ఊహించుకున్నారు.

"నాన్నా! నాకు పెళ్ళి కావల్సిందేనా?" అన్నది కూతురు ఏదో ఉద్దేశాన్ని దృఢపరచుకుంటూ.

తల్లి మందలింపు చూపుపెట్టి "అవే మాటలే అమ్మాయి! ఊరుకో, తెలిసీ తెలియని మాటలు మాట్లాడకు" అన్నది.

తండ్రి మాత్రం ఇట్లా మందలించలేదు. ఆశ్చర్యంతో కూతురు వంకతిరిగి "అదేమిటమ్మా అట్లా అంటావు. పెళ్ళి వద్దంటున్నావేం?" అన్నాడు.

కూతురు - తండ్రి తనను అర్థం చేసుకోగలడని గట్టిగా విశ్వసించి "నాన్నా! నేను ఈ కుంటి బ్రతుకు ఈ ఇంట్లోనే వెళ్ళబోస్తాను. ఎవరికో ఇచ్చి పెళ్ళి చేసి నా బ్రతుకు ఇంకా ఎగతాళి పాలు చెయ్యడం ఎందుకు నాన్నా? అన్నయ్యకి మల్లే నేను వుంటాను. నీకు బరువా నాన్నా?" అని అడిగింది. గొంతు కొంచెం బొంగురు బోతూ కళ్ళవెంట కాస్త తడి కనపడ్డది. తల్లి కూతురు మాటలకి గందరగోళం పడుతుండగానే వాచాలత్వానికి పేరు బడ్డ వకీలు గాబట్టి తండ్రి కూతుర్ని సముదాయించి "అమ్మా! నువ్వనేమాట నిజమే గాని, నీకు ముందాలోచన తోచలేదమ్మా. మేము కళ్ళుమూసిం తర్వాత నీకీ యింటి పరిస్థితి ఎట్లా ఉండబోతుందో ఎవరు చెప్పగలరు? నీ వదిన మంచిదేనని నమ్మడం ఎట్లాగమ్మా? నీ వాడంటూ ఒక భర్త ఉంటే అతనికి తప్పదు. చూడు! డబ్బుంది కదా అంటావా? డబ్బుతోనే జీవితాన్ని సరిపెట్టుకోగలమా? మనిషి ఆసరా ఉండనక్కర్లేదా? చెప్పు తల్లి!" అన్నాడు. ఇన్ని మాటలూ చెబుతున్నాడే గాని ఆయనలో తన కూతురికి అసలు వరుడు దొరుకుతాడా అనే సంశయం ప్రబలంగా బాధిస్తోంది. తను సగం ఆస్తి రాసిస్తానన్నా సాటివాళ్ళెవరూ ఈ వివాహానికి అంగీకరించరు. భోజనాలు ముగించి అందరూ లేచారు. వారాల కుర్రాడు వరండాలో దీపాల కీనీడలో నిలబడి వున్నాడు భోజనానికి కాబోలు - పద్మ తల్లి రుక్మిణమ్మ "ప్రకాశం! రా" అని పిలిచింది. ప్లీడరుగారు అటునించి పోతూ, ప్రకాశాన్ని మరొక్క సారి పరీక్షగా చూస్తూ వెళ్ళిపోయినారు. పద్మ ఆ రాత్రల్లా ఇదే సంగతి ఆలోచిస్తూ నిద్రపోయింది.

* * *

ప్రకాశం ప్లీడరు గారింట్లో వారాలకి కుదిరి మూడో వారం జరుగుతోంది. ప్రకాశానికి ఈ భూమ్మీద నా అన్న వాళ్ళెవరూ మిగలలేదు. ఒకవేళ దూరపుబంధువులున్నారేమో గాని వాళ్ళెవరూ ప్రకాశాన్ని మావాడు అనే స్థితిలోకి వచ్చేవాళ్ళు కాదు. స్నేహితుడు ఎంత దుర్మార్గుడైనా ఒకణ్ణి 'మావాడు' అనుకోగల్గు గాని, బంధువు అట్లాగాదు. ప్రకాశం సంగతైనా అంతే. ఇట్టి పరిస్థితులవల్ల ప్రకాశం వారాలు చేసుకుని, జీతం చందాలు పోగుచేసుకుని చదువుకుంటున్నాడు. ఆ నెల జీతం సరిగా పోగుకాలేదు కాబోలు, ప్రకాశం తెగించి ప్లీడరుగార్ని అడగదల్చుకున్నాడు. సాయంత్రం పూట స్కూల్ నించి సరాసరి ప్లీడరు గారింటికి వెళ్దామనుకున్నాడు. కాని ఆయన ఆవేళప్పుడు ఇంట్లో ఉంటాడా, అనుకుని రాత్రి భోజనానికి పోయినపుడే అడుగుదామని నిర్ణయించుకున్నాడు. ఆవేళ రాత్రి ఆఫీసు రూములో కూర్చుని దీర్ఘాలోచనా తత్పరుడై వుండిన ప్లీడరుగారిని ప్రకాశం ఆకలిగొంతు కదిలించింది. "పంతులుగారూ"! అన్నాడు ప్రకాశం. పంతులు గారు పరాకుమాని, "రా నాయనా! భోంచేశావా? ఇట్లా బల్లమీద కూర్చో" అని అనునయించారు. ప్రకాశం కార్యసిద్ధి అయ్యే శుభ శకునంగా ఈ మాటల్ని తీసుకుని కూర్చోకుండానే, "మరేనండి, ఈనెల స్కూలుజీతం...." అని ఆగాడు గుక్క చాలక. ప్లీడరు గారు కుర్రాడి భావం బోధపర్చుకుని" ఎంత?" అని అడుగుతూనే

డ్రాయర్‌లాగి పదిరూపాయల కాయితం బైటికి తీశారు. ప్రకాశం అదే పదిరూపాయల నోటు కళ్ళారా చూట్టం మొదలు. "అరున్నరండీ!" అంటూ డబ్బు అందుకోడానికి వెళ్ళాడు. ప్లీడరుగారు కుర్రాణ్ణి మళ్ళీ ఎందుకోగాని ఎగా దిగా రెండుసార్లు చూసి "నాయనా! నువ్వెక్కడ ఉంటున్నావేమిటి?" అని అడిగారు. "దీక్షితులు గారింట్లోనండి!" అన్నాడు ప్రకాశం ప్లీడరుగారిచ్చిన డబ్బు చినిగిన చొక్కా జేబుల్లో పెట్టుకుంటూ. ప్లీడరుగారికి ఇప్పటికి ఏదో విషయం నిశ్చయానికి వచ్చినట్లుంది. "ఇట్లా కూర్చోప్రకాశం! నీకో మాట చెబుతాను వింటావు?" అని అడిగారు, బహుప్రేమ పురస్సర ధ్వనితో. ప్రకాశం నేల మీద పరిచివున్న తివాచీ మీద కూర్చున్నాడు. ప్లీడరుగారు చెయ్యవలసిన ఆలోచనంతా చెయ్యడం అయిపోయింది కాబోలు, తీర్మానమైన కంఠస్వరంతో "రేపట్నించీ నువ్వు మాఇంట్లోనే ఉండిపో - అక్కడా అక్కడా వారాలతో అవస్థపడ్డమెందుకు? జీతానికి ఈ బాధ ఎందుకు? నువ్వు ఎంత మేర చదవదల్చుకున్నావో అంతవరకూ నేను చదువు చెప్పిస్తాను. సరేనా?" అని కుర్రాడి మొహంలోకి చూశారు. ఎలక్ట్రిక్ లైట్ కాంతిలో ప్రకాశం మొహం ఆశ్చర్య వివశత్వం చేత రక్తవర్ణం దేలింది. ఇది కలో ఇలో అతనికి బోధపళ్ళేదు. రెండు మూడు నిమిషాల తర్వాత "సరేనండి!" అనగల్గాడు. ప్లీడరుగారు కుర్చీ నుండి లేచి, ప్రకాశాన్ని భుజం మీద చెయ్యేసి బయటకు తీసుకువస్తూ, "ఓ రిక్షా మాట్లాడుకుని సామానంతా తీసుకువచ్చేయ్" అన్నారు. ప్రకాశం చాలా సిగ్గో, మరేదో తెలీదు - నంగిగా, "జంపకానా, ఇంకో జతబట్ట లేనండి అక్కడ ఉన్నది" అంటూ గబగబా నడిచి వెళ్ళాడు.

ఐదు నెలలు దొర్లిపోయినాయి. ఎండలు, వెన్నెలలు మామూలుగానే ఉన్నాయి. అయితే ప్రకాశరావు జీవితం మాత్రం చాలా ఉన్నత పథాల్లోకి వెళ్ళిపోయింది. పాప్లిను షర్టు, గ్లాస్కో పంచలూ, సైకిలూ ఈ ఔన్నత్యానికి ఉదాహరణలు కాదు. దరిద్రుడి ఆలోచనలు కూడా తక్కువ స్థాయిలో చాలా చిన్న స్కేలులోనే ఉంటాయి. అతని కలలు గూడా గొప్పవాటిని ఊహించవు. ప్రకాశరావుకి అసలు కలలే ఉండేవికావు. ఐదు నెలల క్రితం 'చిరిగిన చొక్కాకన్న కొంచెం మంచిచొక్కా ఉంటే బాగుణ్ణు - వాళ్ళ పుస్తకాలు వీళ్ళ పుస్తకాలు చదివేకన్నా సొంత పుస్తకాలుంటే బావుణ్ణు' అన్న ఉద్దేశాలుపోయి ప్రకాశరావు కొంచె గొప్ప కలలు కననారంభించాడు. ప్లీడరు గారింట్లో అతనికి సర్వస్వతంత్రాలు లభించినై. ప్లీడరుగారి భార్య రుక్మిణమ్మ చాలా సౌమ్యంగా ఆదరాభిమానాలతో అతన్ని ట్రీట్ చేస్తున్నది. ప్రకాశరావుకి ఆ సంసారంలో సమస్త విషయాలు తెలిసినాయనటానికి వీల్లేదు కాని, కొన్ని సంగతులు బోధపడినై. అతనికి తెలిసిన విషయాలవల్ల అతనిలో కొన్ని ఆశలు ఏర్పడినై. వాటిని ఎక్కువ చేయడానికా అన్నట్లు, పద్మతో పరిచయం కూడా అభివృద్ధి అవుతూన్నది. పద్మ ప్రకాశరావును చాలా అభిమానించింది అతని లేమి కారణంగా. పద్మ ప్రకాశరావు అనేక సాయంత్రాలు కూర్చుని మాట్లాడుకుంటూ ఉండేవారు. ఆ యిద్దరూ మాట్లాడ్డం రుక్మిణమ్మకు చాలా ఇష్టంగా కనిపించింది. ప్లీడరుగారు కూడా ఈ పద్ధతిని ప్రోత్సహించుతున్నారేమో అన్నట్లు మౌనం వహించారు. ప్రకాశరావు పద్మని గూర్చి చాలా సార్లు ఆలోచించాడు. ప్రపంచ జ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఏ వ్యక్తికైనా ఈ సమాజ వాతావరణం బోధపడకపోదు. ఎవరికైనా ఆర్థిక విలువలు పెరిగితేనే ఈ సంఘంలో మర్యాద. వారి వారి బుద్ధి కుశలతకుగాని, మంచి చెడ్డలకు గాని, కళానైపుణ్యాలకు గాని, యదార్థంగా ఇవ్వబడే మర్యాదలూ, విలువలు కొద్దిపాటే. చాలా చోట్ల ఉండవు కూడాను. ఈ

సాంఘిక నైజం ప్రకాశరావుకి అస్పష్టంగా బోధపడకపోలేదు. వెనక ఎవ్వరూ పలకరించి ఎరుగని తనను ఇప్పుడు అందరూ గౌరవిస్తున్నారు. అవి తను ధరించిన దుస్తుల్ని మాత్రమే గాదు, తనని గూడానూ. ఇదివరకెప్పుడూ గుర్తింపబడని తన అణకువా మంచితనమూ, ఇప్పుడు గౌరవించబడుతున్నై.

ఇట్లాంటపుడు తనస్థితి ఎల్లకాలమూ ఇట్లాగే ఉండాలని అతను భావించడంలో ఆశ్చర్యంలేదు. అయితే ఈ గౌరవ స్థిరత్వం తనకెట్లా లభిస్తుంది? ఈ ఆదరణలూ, అభిమానాలు ప్లీడరుగారిలో స్థిరంగా వుంటాయా? ఏమిటో..... ఇట్లా ఆలోచిస్తూ ప్రకాశరావు దృష్టి ప్లీడరుగారి అవిటి కూతురు మీద నిలిచింది. ఆమెకి అందం ఉన్నది. చదువూ ఉన్నది. అయితే కాళ్ళు లేవు.... ఆ అమ్మాయికి పెళ్ళి ఎట్లాగూకాదు. ఆమెని తనకి... ఆపైన ప్రకాశరావు ఆలోచించడానికి కూడా సాహసించలేక పోయాడు. కుంటిదైనా తనబోటి అనాథ కిస్తారా? అని నిరాశపడి తనలోతానే తిట్టుకుని వూరుకున్నాడు. ఎటువంటి స్థితిలో ఉన్నా కొంత కాలం హీనావస్థలో ఉన్నవాడు తప్పక 'ఇన్‌ఫీరియాటీ ఫీల్' అవుతాడు కాబోలు! ప్లీడరుగారు - ప్రకాశరావు ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాస్ అయ్యేవరకూ ఏమీ మాట్లాడలేదు. అతని దర్జాకి తోడు రానివవ్వలేదు. ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాస్ అయి, ఇంటర్‌లో ప్రవేశించే ముందు ప్రకాశరావు మామూలుగా విజయరాఘవరావుగారి అనుమతి పొందటానికి వచ్చాడు ఒక చల్లని సాయంత్రం వేళ. ఆ వేళ ప్లీడరుగారు ఎటూ పోకుండా పై అంతస్తులో కూర్చుని రేడియో సంగీతం వింటున్నారు. ప్రకాశరావు రావడం చూసి ఆయన తన పక్క కుర్చీ చూపి కూర్చోబెట్టారు. ప్రకాశరావు ఏదో అడగాలని వచ్చాడని ఊహించుకున్నారు కాబోలు - రేడియో వాల్యూం బాగా తగ్గించి. "ఏం నాయనా! ఏం కావాలి?" అని మామూలు ఆదర స్వరంలోనే అడిగారు. ప్రకాశరావు కాస్త ఉపోద్ఘాతం ఇవ్వాలనుకున్నాడు గాని ఎట్లా ఇవ్వాలో తెలీక, "ఇంటర్ చదువుదామని ఉందండీ!" అన్నాడు బహూనమ్రతగా.

"దానికేం, కానీ!" అన్నారు ప్లీడరు గారు. ఆయన గొంతులో ఏదో ఒక విషయాన్ని నూతనంగా చెప్పవలసి వచ్చినప్పటి ఆదుర్దా,పెనుగులాటా ధ్వనిస్తోంది. ప్రకాశరావు ఆయన మాటకోసం ఎదురు చూస్తున్నాడు. విజయరాఘవరావుగారు రేడియో పూర్తిగా ఆపేసి " ప్రకాశం! నీతో ఎన్నాళ్ళ నుండో ఒక విషయం చెబుద మనుకుంటున్నాను" అని అన్నారు కుర్రాడి మనస్తత్వాన్ని పరిశీలిస్తున్న వారిలా.

ఏం పిడుగు పడనున్నదో! అన్నట్టు మౌనంగా వింటున్నాడు ప్రకాశరావు.

ప్లీడరుగారు ఇదివరకే ఆలోచించుకుని ఉన్నారు. తను ప్రకాశరావుకి కలిగించిన సౌకర్యాల ప్రతిఫలం తను చెప్పబోయే దానికి అతను అంగీకరించి తీర్తాడని అంచనా వేసుకున్నారు. "నాయనా! నీకైనా ఎవ్వరూ లేరంటున్నావు. నీబోటి వాణ్ణి బాగుచేస్తే కలకాలం జ్ఞాపకం ఉంచుకుంటావు. నన్ను ఒక్క దిగులు మాత్రం రాత్రి, పగలూ వేధిస్తోంది. అమ్మాయి భవిష్యత్తు ఏమిటా అని" ఆపైన చెప్పదల్చుకున్న మాటలు గొంతు బొంగురు పోవడంచేత ఆగిపోయినై.

ప్రకాశరావు గుండె దడదడలాడుతున్నది. ఏమిటా చెప్పబోయే మాట? "చెప్పండి..." అన్నాడు, అది ఏదైనా వినటానికి సిద్ధపడి.

"అమ్మాయికి పెళ్ళి చేస్తేనేకాని, దాని దిగులు నాకు పోదు. ఇటు చూడు, నీకు జీవితాంతం ఏ కష్టాలు లేకుండా చేస్తాను....."

ఆ ధోరణి ప్రకాశరావుకి అర్థమైనట్లు తోచింది. "సరేనండి! మీ రింతగా చెప్పాలా....' మీరు చేసిన ఉపకారానికి ఇంకా ఎట్లా కృతజ్ఞత తీర్చుకోను?" అనేశాడు.

ప్లీడరుగారు "మంచిది నాయనా!" అని మాత్రం అన్నారు.

3

ప్రకాశరావుకి, పద్మకీ వివాహం ఏ ఆడంబరాలు లేకుండా ప్రశాంతంగా జరిగిపోయింది. ప్లీడరుగారు పద్మ పేర ఒక యిల్లు, పది ఎకరాలు పొలమూ రాశారు. తన పేర రాయమని అడుగు దామని ప్రకాశరావు అనుకున్నాడు. కాని ఒక రకమైన తక్కువదనం "ఫీల్" అయ్యేవాడికి అవసరానికి మాటలు పెగలవు. ప్రకాశరావుకి పెళ్ళి తర్వాత ఏదో చింత పట్టుకుని మనస్థిమితం లేకుండా ఉంటున్నది. చదువు మానేశాడనే చెప్పాలి. జరగనన్నాళ్ళూ ఉన్న ఆసక్తి, జరుగుబాటురాగానే పోయింది. అతని చింతకి కారణం భార్య పెళ్ళినాడు వచ్చిన కొద్దిమంది మిత్రులూ తన వంక జాలిగా చూస్తూ "అదృష్టవంతుడివిరా!" అన్నారు. ఈ జాలికి కారణం వాళ్ళకుమల్లే తన భార్యతో తను షికార్లు వెళ్ళలేక పోవటమేనా?....... ఇంకా ఆలోచించేవాడేకాని మనస్కరించక వూరుకున్నాడు. ప్లీడరుగారి సలహాతో, పద్మ పేర రాసిన ఇంట్లోనే కాపురం పెట్టాడు. వంట మనిషిని కుదుర్చుకున్నాడు. సాఫీగా జరిగిపోతోంది జీవితం. కాని ప్రకాశరావు ఊహించిన పథాల్లోకి పద్మ దగ్గిర అతనికి సుఖాలు లభించలేదు. ప్రకాశరావు దుర్మార్గుడు కాదు. అతను భార్యావ్రతుడు మాత్రం కాలేకపోయాడు. అతను నెల్లో ఇరవై రోజులు ఇంట్లో పడుకోవడం లేదు. ఈ సంగతులు స్పష్టంగా తెలిసినా, పద్మ అతన్ని ఏమీ అనలేదు. తనకున్న బలహీనతే దీనికి కారణం కాదు. అసలామెకు పెళ్ళంటే మొదట్నించీ సరిపడలేదు. ప్రకాశరావు మీద ప్రత్యేకించి ఆమె ఏమీ అభిమానం చూపలేకపోయింది కూడాను. ఎవరైనా తనకు భర్త అవుతాడూ అంటే, అతను చాలా స్వార్థంతోనే అట్టిపనికి పూనుకుంటాడు అనేది ఆమె దృఢనిశ్చయం. నిజం కూడా అంతేనేమో! ప్రకాశరావైనా, ఏమీ లేనివాడు గాబట్టే ఈ వివాహానికి అంగీకరించాడు. గాని అతని దయార్ద్ర హృదయం కరిగికాదు. ఇంత స్పష్టంగా భర్త స్వార్థ పరత్వం ద్యోతక మౌతున్నపుడు ఆమె భర్త ఇంట్లో పడుకోక పోయినా బాధపడలేదంటే అసహజం ఏమీ లేదు. ప్రకాశరావు ఆమెని ఎప్పుడూ హేళన చెయ్యలేదు. తన ప్రవర్తనే అన్నిటికీ సమాధానం అన్నట్లు ఊరుకున్నాడతను. అయితే ప్రకాశరావుని ఇప్పుడూ ఒక సమస్య వేధిస్తూనే వుంది. అది అనాది నుండీ వేధిస్తున్న సమస్యే. పరస్త్రీ సాంగత్యానికి డబ్బుండాలి. తన పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ వ్యక్తికి అవసరాలు పెరుగుతాయికదా? ఈ ఆర్థిక చిక్కులో, ప్రతిసారీ భార్యని డబ్బు అడగడం ప్రకాశరావుకి చికాకుగా వుంది. కాని ఏం చెయ్యడం? ఆస్తి కాస్తోకూస్తో వుంటే అది పద్మపేరుతోనే వుంది. ప్రకాశరావు ఇట్లా అవుతాడని ప్లీడరుగారు అనుకోకపోయినా, 'ఎట్లా ఉండబోతుందో' అనే కూతురిపేర రాశాడు ఆస్తి. ప్రకాశరావుకి పరువుగా దొరకగలిగినన్ని ఋణాలు దొరికినై. కాని ఎన్నాళ్ళు? మొత్తం ఏడెనిమిది వందలయ్యేటప్పటికీ ప్రకాశరావు భార్యని అడగాల్సి వచ్చింది.

"పద్మా! నాకొక ఎనిమిది వందలు కావాలి" అన్నాడు చాలా ప్రేమ పురస్సర ధ్వనితో.

పద్మ అతని కళ్ళలోకి క్షణం చూసి, "ఎనిమిదివందలా! ఎక్కడ తెమ్మన్నావు నన్ను? అంది.

"నేనెట్లా చెప్పను? మీ నాన్ననో, అమ్మనో అడిగి....." అని మాట ఆపి, భార్య ముఖవర్చస్సులోని మార్పుకి విభ్రాంతుడైనాడు ప్రకాశరావు. అసహ్యం వ్యక్తపడే ముఖ కవళికలు పెట్టి, పద్మ "వాళ్ళను అడగను. నా దగ్గరలేవు" అని ఖచ్చితంగా చెప్పేసింది.

ఎన్నడూ కోపం ఎరుగని ప్రకాశరావుకు కోపంతో ఒళ్ళు కంపరమెత్తింది. 'నాన్‌సెన్స్! దీని దగ్గర కూటికి పడివున్నందువల్లేగా ఇది ఇంత నిక్కచ్చిగా వెధవ మొహం వేసుకు చెప్పేసింది డబ్బులేదని?

దీనికి ఒక్కటే ప్రతీకారం. ఈ కుంటి ముండని వొదిలెయ్యటమే కాని తన భవిష్యత్తును గురించిన ఆలోచన తన కనవసరం ఇప్పుడు, ప్రకాశరావు మంచం దిగి "కుంటిముండా! నీతో కాపురం చేసినందుకు నన్ను బాగా గౌరవించావు, చాలు! నేను ఎక్కడయినా బతగ్గలను. నీకూ, నాకూ ఇంతటితో వొదిలిపోయింది". అంటూ గడపకేసి నడిచాడు. పద్మ ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది. ప్రకాశరావు అనుకున్నట్లు ఆమె అతని పాదాలపై బడలేదు. అప్పుడేకాదు, ఆమె జీవితాంతం వరకూ అతనికోసం ఏవిధమైన బాధపడనూలేదు.

✸

'రక్త స్పర్శ' కథాసంపుటి, 1963.